# మహావీర చక్ర

- నిడదవోలు మాలతి

మహావీరచక్ర బిరుదాంకిత, మాలతీనామధేయ, glorified chaufferగా వెలుగుతున్న నాకథ ఎట్టిదంటే ...

అసలు అమెరికా రాగానే ఆడవారిచేత చక్రం, మగవారిచేత గరిటా గూటిలో గువ్వపిట్టల్లా, ఆకుల్లో అణిగిమణిగిన కోయిలలా అమిరిపోతాయి.. ఎక్సప్షనులుంటారు, కాదనను.

నాకు మంచి డ్రైవరునన్న పేరుంది. రోడ్డుమీద బీటుపోలీసులతో సత్సంబంధాలున్నాయి. అపార్థం చేసుకోకండీ మరి.

పోలీసాళ్లకి నేనంటే సరదా. (లేదండీ వాళ్లు నాబ్లాగు చదవలేదు. వాళ్లకి తెలుగు రాదు). పోలీసాళ్లు నేనంటే సరదా పడడం నా ముసిలిమొహం, తోలురంగూ అంటారు అభిజ్ఞవర్గాలు. ఇది ఇంకా రిసెర్చి చెయ్యాలి.

ఏమైతేనేం, గోతికాడ నక్కలా పొంచున్న ఏపోలీసాయనో చీటికి మాటికి నన్నే పక్కకి లాగేయడం మాత్రం నాజీవితంలో సర్వసాధారణం అయిపోయింది అనతికాలంలోనే. ఆదిలో నాకైతే కాళ్లలో నెత్తురు ఎగసి గుండెలకి తన్ని ధన్ ధన్‌మని కొట్టుకున్న రోజులున్నాయి.

అది చాలనట్టు సెల్లులోటి. నేను చక్రంపట్టిన తొలిరోజుల్లో ఈసొద లేదు. ఈమధ్యనే పదేళ్లవుతోందేమో మా పాలకులకి హుషారొచ్చేసి, ఎవరేనా ఎక్కువ స్పీడులో వెళ్తే మీరు మీసెల్లులో పిలిచేసి మాకు చెప్పండి అని సామాన్యులకి తాఖీదిచ్చేరు. ఇహ అడక్కండి నాఅవస్థ. నావెనక వున్న ప్రతి డ్రైవరూ నామీదే చెప్పేస్తున్నాడని నాకొకటే హడలు. అంటే నేను స్పీడుగా వెళ్తున్నానని కాదు. తమకి తెలీందేంవుంది, పేనుకి పెత్తనం ఇస్తే ... అనీ..

నాకు సెల్లు లేదు, జీయస్పీవో ఏదో అదీ లేదు. ... నాకు లేనివి చాలా వున్నాయి. అవన్నీ ఎందుగ్గానీ ...

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ..

ఈమధ్య నేనూ రాధికా "మీర్రండి" అంటే "మీర్రండీ" అంటూ పిలిచేసుకుంటున్నాం చెమ్మచెక్కలాడుకుంటున్నట్టే. ఈ వూరికి ఆవూరెంత దూరమో ఆవూరికి ఈవూరూ అంతే దూరం. నిన్న జరిగిన సంభాషణ మాత్రం కొంచెం వేరుగా వుంది.

"నేను కొంతకాలంగా వూరు వదలి వెళ్లడం లేదు, నా రోడ్ సెన్స్‌కి తకరారొచ్చిన్నట్టు అనుమానంగా వుంది. ఎక్కడ బయల్దేరితే ఎక్కడ తేల్తానో తెలీడంలేదు," అన్నాను.

"మీరు తెగ నవ్విస్తారండీ" అంది రాధిక.

హయ్యో నాబతుకెంత నవ్వులాట అయిపోయిందీ అని కొంచెం బాధ పడి తరవాత కథలో పడిపోయాను. ముందొకసారి చెప్పలేదూ నిజం చెప్పి నవ్వించొచ్చని.

ఇంతకీ నేను ఈ మహరాజవీధులు ఎక్కడం, పొరుగూరికెళ్లడం ఎందుకు మానేశానో చెప్తాను.

ముప్ఫైఏళ్లనించీ బండి తోలుతున్నాను. అమెరికాలో మూడు దిక్కులా తిరిగి వచ్చేశాను. ఆప్తవర్గంలో మంచి డ్రైవరని మెప్పు పొందేను. అయినా మరోవంక బీటుపోలీసులతో వాదులాటలు తప్పడంలేదు. తోచీ తోచనమ్మ తోటికోడలు పుట్టింటికెళ్లిందని, వాళ్లకి మరేం పని లేకపోతే, నన్ను నడిరోడ్డుమీద ఆపేసి, నాయోగక్షేమాలు కనుక్కుని, నీమంచికోసమేనని బులిబుచ్చి కబుర్లు చెప్పి, నెత్తిమీద చెయ్యి పెట్టి బుజ్జగించడం తరవాయిగా, అంపకాలు పెడుతూ వుంటారు.

హాస్యం కాదండీ, ఈకథలన్నీ పరమ సత్యాలు. సరస్వత్తోడు.

నాకళ్లు అసలు సెర్చిలైటుల్లా పనిచేస్తాయి. నాకు కళ్లజోడు కూడా అక్కర్లేదు. చుట్టూ చూసుకుంటూ డ్రైవు చేస్తాను. రోడ్డుమీద నాకు చిరాకు కలిగించే సంగతులు కొన్ని వున్నాయి. పైన చెప్పిన సెల్లులు ఒకటి. రెండు, ట్రాఫిక్ సైనులు. Red light, stop sign, yield, no turn on red... ఇన్ని ఆంక్షలు రోడ్డుమీదకెళ్తే, ... ఇవి చాలనట్టు exceptions. శనివారం, ఆదివారం, శెలవురోజు, సాయంత్రం 4 to 6 p.m. no left turn ...ఎందుకివన్నీ?

నిజంగా ఎవరు ఎవరికి పెట్టేస్తారోనని చూసుకుంటూ జాగ్రత్తగా బండి తోలుకుపోయేవాళ్లకి, ఇవాళ ఏంవారం, శెలవునా కాదా, ఇప్పుడు నాలుగ్గంటలయిందా లేదా, ఎడమవేపు తిరగడానికి ఇది తగు సమయం అవునా కాదా .....లాటివి క్షణాలమీద తోస్తాయా వెనక ఏ యస్యువీనాథుడో సెల్లోటి చేత బుచ్చుకుని మీదమీద కొచ్చేస్తుంటే?

నన్నడిగితే, పాలకులు చోదకులకు గట్టిగా చెప్పవలసింది ఒక్కటే ఒక్క మాట "ఒళ్లు దగ్గర పెట్టుకుని డ్రైవు చెయ్యండి బాబుల్లారా, తల్లుల్లారా" అని. నాకు ముఖ్యంగా కోపం ముంచుకొచ్చేది వీధులు నిర్మానుష్యంగా వున్నప్పుడు, ఎక్కడా కారు జాడా, మనిషిజాడా కనుచూపుమేరల్లో కంటికాననప్పుడు కూడా మనం ఇవన్నీ పట్టించుకోవాలి.

ఇలా నేను ఆలోచిస్తుండగా, ఒకరోజు ఒకచిన్నరోడ్డుమీద స్టాపు సైను వచ్చింది. అదేలెండి నేను ఆసైనుదగ్గరకొచ్చేను. చుట్టూ ఎక్కడా నరవాసన లేదు. నేను రెప్పపాటుకాలం బ్రేకుపెడలు తొక్కి వదిలేసాను.

ఇందాకా చుట్టూ ఎక్కడా కారూ, నరులూ లేరన్నానా. Wrrrrrrroong.

నేను విలాసంగా సాగి పోతుండగా, పొలోమని పోరు పెడుతూ పోలీసుకారు తగిలింది కుప్పించి ఎగయు కొదమ సింగమువోలె.

సరే మర్యాదగా నాకారు పక్కకి తీసి, నన్ను దాటిపోతున్న కారులబారులు తిలకిస్తూ, నన్ను ఎవరు గమనిస్తున్నారో చూస్తూ కూర్చున్నాను.

పోలీసాయన నెమ్మదిగా నాకారు దగ్గరకొచ్చి, "అల్లక్కడ రెండువందల గజాలవెనక నువ్వు ఆపలేదు తెలుసా" అన్నాడు.

నేను మర్యాదగా "ఆపేను" అన్నాను.

"ఆపలేదు"

"ఆపేను"

ఇలా ఇద్దరం మూడుసార్లు వాక్ గిరికీలు కొట్టేక, "నేను వెళ్లి నీ రికార్డు చెక్ చేస్తాను. వేరే టికెట్లుంటే, మరోటిచ్చుకుంటాను" అన్నాడు.

సరేనన్నాను.

ఆ శిక్షక భటుడు పదినిముషాలతరవాత వచ్చి, "నీ లైసెన్స్ ప్లేటు జీవితం ముగిసిపోడానికి నెలరోజులుంది తెలుసా" అన్నాడు.

"ఇంకా నెల రోజులుంది కదా" అన్నాడు.

"నీ డ్రైవింగ్ లైసెన్స్ త్వరలోనే రిన్యూ చెయ్యాలి" అన్నాడు.

"అది చెయ్యడానికే వెళ్తున్నాను".

"సరే. జాగ్రత్తగా వెళ్లు. నీమంచికే చెబుతున్నాను" అనేసి వదిలేడు నక్షత్రకుడు.

అలా వుంటుందన్నమాట పోలీసుల్తో నాదోస్తీ.

ఇలా చీటికి మాటికి ఆపేస్తూండడం, నామంచికేనని నాకు నచ్చచెప్పడం జరుగుతూ వచ్చింది కొంతకాలం. ఆతరవాత ఒకరోజు ఓ నోటిసు వచ్చింది పోస్టులో. సరే వీళ్లదాడి రోడ్డుమీదే కాకుండా ఇంటిమీద కూడానా అనుకుంటూ తీసి చూశాను.

నేను "ఫలానారోడ్డుమీద ఉదయం ఏడున్నరకి స్కూలుముందు స్పీడుగా వెళ్తున్నాననీ, ఇది మొదటినోటీసుగా గ్రహించవలసిందనీ, మరోసారి చేస్తే ఫైనులు, పాయింటులు ..".

"హమ్మయ్య, దొరికాడురా మిడతంభొట్లు" అనుకున్నాను పరమానందపడిపోతూ.

సీరియస్‌గా కూర్చుని, ఘాటుగా జవాబు రాసేసేను డి.వో.టి.వారి దివ్యసమ్ముఖాలకి.

"ఫలానారోజున ఏడున్నరకి అసలు నేను ఫలానా కానీ మరో రోడ్డుమీద కానీ లేను, నా వుద్యోగం ఫలానా కాలేజిలో తొమ్మిది గంటలకి మొదలవుతుంది. నేను ఎనిమిదిముప్పావుకి బయల్దేరుతాను మాయింటినించి. కావలిస్తే నామాట ధృవపరుస్తూ మాడైరెక్టరునించి ఎఫడెవిట్ తెచ్చి సమర్పించుకోగలను.

అసలు చివరిమాటగా నావిన్నపము - ఇదంతా చూస్తుంటే మీరు నన్ను ప్రొఫైలు చేస్తున్నట్టు కనిపిస్తున్నారని అనిపిస్తోంది. నిజానికి అది నిజమేనని నేను గట్టిగా నమ్ముతున్నాను." ☺ ☺

ఇది జరిగి అయిదేళ్లయింది. లైసెన్స్ ప్లేటు మళ్లీ రిన్యూ చేసే టైమవుతోంది. కిందటేడు వచ్చిన స్టికరే ఇంకా అంటించలేదు నేను. ఇప్పుడు నేను రోజూ పోలీసులముందునించి దర్జాగా, రాజెవరికొడుకు అన్నంత ధీమా వెళ్లిపోతున్నాను. ఏ పోలీసూ నడిరోడ్డుమీద మళ్లీ నన్ను నిలపేయలేదెప్పుడూను.

అయ్యో రాతా, నేను హైవే డ్రైవింగు ఎందుకు చెయ్యనో చెప్పబోయి మరేదో చెప్పేసినట్టున్నాను. ఏంటో… పెద్దతనం వచ్చేస్తోందని ఇలాటప్పుడే అనిపిస్తుంది. ☹